# మనసా ప్రేమించవే!

అలారం మ్రోగి మ్రోగి ఆగిపోయింది. అహల్యకి కళ్ళు తెరవాలని అనిపించలేదు.
ఏమాత్రం కదలలేనంత నిస్సత్తువగా వుంది.
"అహల్యా!" ఆమె నడుము చుట్టూ చేయివేస్తూ పిల్చాడు సుధీర్.
"ఊ." ప్రక్కకి తిరిగి అతని గుండెలలో మొహం దాచుకుంది.
"అయిదయినట్లుంది లేవవూ!"
"..కడుపులో నెప్పిగా వుందండీ."
"ఏం నెప్పి!"
సమాధానంగా అతన్ని మరికాస్త హత్తుకుపోయింది అహల్య.
"ఎప్పుడూ వచ్చే నెప్పేనా!" ఒక్క క్షణం ఆగి చెప్పాడు సుధీర్. "ఆ టాబ్లెట్ ఏదో వేసుకుంటావుగా, అది వేసుకుని కాఫీ త్రాగు."
అహల్య మాట్లాడలేదు. బాధని భరించలేకపోతున్నట్లూ ఆమె తల అతని హృదయం మీద అస్థిమితంగా కదిలింది.
రెండు నిమిషాలయినా ఆమె కదలకపోవడం చూసి యింకొంచెం గట్టిగా చెప్పాడతను.
"లే యింక. మళ్ళీ టైం చాలలేదని కంగారు పడ్తావు."
చిన్నగా నిట్టూర్చింది అహల్య. దుప్పటి ప్రక్కకి తప్పించి మంచం దిగింది. "అవును. తప్పేదేముంది!" అనుకుంది బాత్ రూంలోకి నడుస్తూ.
కాఫీ త్రాగి టాబ్లెట్ వేసుకున్న తర్వాత కాస్త హాయిగా అనిపించింది. హుషారు తెచ్చుకుని పని మొదలు పెట్టింది. పనిపిల్ల రాలేదు. దాన్ని తిట్టుకునేందుకు టైమూ, ఓపికా రెండూ లేవు.
ఏడయ్యేసరికి పనులన్నీ పూర్తవ్వాలి.. వంటతో సహా.
తొమ్మిది గంటలకి ఆఫీస్ లో వుండాలంటే, ఏడున్నరకల్లా బస్ స్టాప్ లో వుండాలి. బస్ స్టాప్ కి అయిదు నిమిషాలు ఆలస్యంగా వెళ్తే ఆఫీస్ కి అరగంట ఆలస్యమవుతుంది.
సుధీర్‌కి ఆ బాధ లేదు. అతని ఆఫీస్ పది గంటలకి. అదికూడా చాలా దగ్గర. బైక్ ఎక్కాడంటే అయిదునిమిషాల్లో ఆఫీస్ ముందుంటాడు.
పని ముగించుకుని స్నానం చేసి ఆమె వచ్చేసరికి సుధీర్ యింకా నిద్రపోతూనే వున్నాడు.

ప్రొద్దున పూట ఈ హడావుడికి గుండెల్లో వణుకొస్తుంది అహల్యకి. వళ్ళంతా చెమటలు క్రమ్మేస్తాయి. అలా కంగారుగా కనిపిస్తే సుధీర్ కి నచ్చదు. "ఇంకొంచెం ముందు లేవచ్చు కదా!" అని విసుక్కుంటాడు.

అందుకే ఒక్క క్షణం ఫాన్ క్రింద నిల్చుని, గుండెలనిండా గాలి పీల్చుకుని, అపుడు స్థిమితంగా బెడ్రూమ్ లోకి నడిచింది.

"ఏమండీ!" అన్న పిలుపుకి కళ్ళు విప్పాడు సుధీర్. చక్కటి ఇస్త్రీ చీరలో, చేతిలో కాఫీ కప్ తో, ఫ్రెష్‌గా, యాక్టివ్‌గా కనిపించిన భార్యని చూస్తే సుధీర్‌కి ముచ్చటేసింది. కాఫీ అందుకుని ప్రక్కన పెట్టి ఆమెని వళ్ళోకి లాక్కున్నాడు.

"అబ్బా! చీర నలిగిపోతుందండీ." అతని క్రాఫ్ సరిచేస్తూ చెప్పింది అహల్య. "వంట అయిపోయింది. అన్నీ డైనింగ్ టేబుల్ మీద పెట్టాను. భోజనం చేసి ఆఫీస్‌కి వెళ్ళండి."

కాటుక దిద్దిన ఆమె కళ్ళను పరవశంగా చూస్తూ తలవూపాడతను. కలువరేకులలాంటి ఆకళ్ళను అతని పెదవులు సున్నితంగా తాకాయి. అతని చేతులు తనని చుట్టేస్తుంటే చిన్నగా అంది అహల్య.. "నేనింకా అన్నం తినాలండీ." అని. సుధీర్ వినిపించుకోలేదు.

అతని చేతుల్లోనుండి తప్పుకుని ఆమె యివతలికి వచ్చేసరికి టైము ఏడూ యిరవై. అహల్యకి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. "ఎపుడు అన్నం తినాలి! ఎపుడు బస్ స్టాప్ దాకా పరుగెత్తాలి! ఛ. ప్రతిరోజూ యింతే. ఎంత తొందరగా లేచినా ఈపని తెమిలి చావదు." అసహనంగా అనుకుంది.

"ఏవండీ! బైక్ మీద బస్ స్టాప్ దాకా డ్రాప్ చేస్తారా!"

ఆమె ప్రశ్న విని టైం చూశాడతను. "ఇంకా పదినిమిషాలుందిగా!"

"అదికాదండీ. మీరు డ్రాప్ చేసేట్లయితే నేను అన్నం తింటాను. ఆకలేస్తోంది."

"స్నానం చేయలేదు కదోయ్. ఈ జిడ్డుమొహంతో ఎలా రాను!" బద్ధకంగా అన్నాడు.

అహల్య యిక రెట్టించలేదు. ఇంకొకసారి అడిగితే జరిగేదేమిటో ఆమెకి తెలుసు. అతనికి యిష్టమయితే మొదటిసారి అడిగినప్పుడే చేస్తాడు. లేదంటే మూడోసారి అడిగినప్పుడు తిడతాడు.

ఆమె వెళ్తూంటే వెనుకనుంచి అడిగాడతను. "రేపు సెలవు పెడుతున్నావుగా!" అని.

అహల్య ఒక్క క్షణం ఆగింది. "సెలవు దొరకడం కష్టమవుతుందేమోనండీ.. పోనీ.."

సుధీర్ చూసిన చూపుకి ఆమె చెప్పాలనుకున్న మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

తలవంచుకుని బయటకి నడిచింది.
మర్నాడు అతని ఫ్రెండ్‌నీ, భార్యనీ భోజనానికి పిల్చాడు సుధీర్. అందుకే సెలవు పెట్టాలి.
రెండ్రోజుల నుంచీ హడావుడి వాళ్ళరాక కోసం. ముందురోజు బజారుకి వెళ్ళి ఆవిడకి చీర తెచ్చింది. కూరలూ, సరుకులూ తెచ్చింది.
"ఇంత హడావుడి పడే బదులు ఏదన్నా హొటల్‌కి తీసుకువెళ్ళి మంచి డిన్నర్ యిద్దాం" అంటే సుధీర్ వినడు.
రేపు ఆఫీస్‌లో మీటింగ్ వుంది. అందరూ తప్పకుండా అటెండ్ అవ్వాలని చెప్పారు.
ఇలాంటి టైమ్‌లో వెళ్ళి డైరక్టర్‌ని లీవ్ అడగడం . . . ఎంత అసహ్యంగా వుంటుంది!
పెళ్ళికి ముందు చాలా సిన్సియర్ వర్కర్ అని పేరుండేది ఆమెకి. ఇప్పుడు ఆ గౌరవమంతా పోయింది.
ఆఫీస్‌కి అంకితం అయ్యి పనిచేసే అవకాశమూ, పేరు తెచ్చుకునే అవకాశమూ వుండవు.
ఇంటికి అంకితమయినా యింట్లోవాళ్ళకి ఆ గుర్తింపు ఎప్పటికీ వుండదు.
చిన్నగా నిట్టూర్చింది అహల్య. ఆఫీస్‌కి వెళ్ళినా ఈ ఆలోచనలు వదలలేదు.
అన్యమనస్కంగా ఫైల్ తెరిచిన ఆమెకి అందులో ఇన్విటేషన్ కార్డ్ కనిపించింది.
ముచ్చటైన కార్డ్ మీద ఒక అమ్మాయి బొమ్మ. చెంపకు చేయి చేర్చి కన్నులతో ఆశ్చర్యాన్ని అభినయిస్తూన్న డ్యాన్సర్ బొమ్మ.
ముందురోజు వసుంధర యిచ్చింది ఆ కార్డ్. "నీకు మాళవిక డ్యాన్స్ అంటే యిష్టం కదా! రేపు రవీంద్ర భారతిలో ఆమె ప్రోగ్రామ్ వుంది. వెళ్తావా!" అంటూ.
ఆమాట వినగానే ఎగిరి గంతులేసింది అహల్య మనసు.
రాత్రి సుధీర్ మంచి మూడ్ లో వుండగా అడిగింది. "ఏవండీ! రేపు ప్రోగ్రాంకి వెళ్దామా!" అని.
"ఏం చూడాలోయ్ ఆ డ్యాన్స్ ప్రోగ్రాములు, మన పనులన్నీ మానుకుని. ." తేల్చేశాడు అతను.
అయినా యింకొకసారి చెప్పింది "నేను ఒక్కదాన్నీ వెళ్తాను. మీరు తొమ్మిది గంటలకి రవీంద్రభారతికి రండి. ఇద్దరం కలిసి ఇంటికి వచ్చేద్దాం. . ."
"నేను రాలేను." ఖచ్చితంగా చెప్పాడతను ఆమె మాటలు పూర్తవక ముందే. "చలిలో వచ్చి బయట నీకోసం ఎదురుచూపులు చూడటం నా వల్ల కాదు."

"పోనీ నేనే బస్‌లో వచ్చేయనా!"

అంతే. ఆ మాటతో సుధీర్‌కి సహనం నశించింది. "అంత మొండితనం ఏమిటి నీకు! ఒకసారి చెప్తే అర్థం కాదా!" అంటూ విసుక్కున్నాడు. ఆతర్వాత లైట్ ఆర్పేసి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

ఈరోజు ప్రొద్దున వచ్చేటపుడు కూడా మళ్ళీ మనసు పూగిసలాడింది. ఇంకోసారి సుధీర్‌ని అడుగుదామా అనుకుంది కానీ ధైర్యం చాలలేదు.

"భార్యాభర్తలన్నాక కొన్ని విషయాలకి అడ్జస్ట్ అయిపోవాలి. ఆయన చూపించే ప్రేమ ముందు యిలాంటి చిన్న విషయాలకి యింపార్టెన్స్ ఏముంది!" అహల్య తన మనసును సమాధాన పరచుకుంది.

ఆమె తత్వమే అది. చాలా విషయాలలో అలాగే సర్దుకుపోతుంది.

వసుంధర అడుగుతూ వుంటుంది "ఎందుకు ప్రతి విషయానికీ అలా భయపడతావు నువ్వు!" అని.

అహల్యకి నవ్వొస్తుంది ఆ మాటలకి. "నీ మొహం. భయమేముందే! ఆయనకి యిష్టంలేని పనులు చేయడం నాకిష్టం వుండదు. అంతే. ఆయన నాకోసం యింత చేస్తారు. నేను ఆయన కోసం ఆమాత్రం అడ్జస్ట్ అవలేనూ!"

"ఏం చేశారమ్మా ఆయన నీకోసం! కూరలు తెమ్మంటే తేరు. సరుకులు తెమ్మంటే తేరు. గ్యాస్ సిలిండర్ అయిపోతే నువ్వే తెచ్చుకోవాలి. ఇంట్లో ప్రతిపనీ నువ్వే చేయాలి. అన్నిటికీ నువ్వే సెలవులు పెట్టుకోవాలి. అలా అని వుద్యోగం మానేస్తానంటే "ఛాఛ్. వీల్లేదు." అంటారు. అంతే కదూ!"

"చాల్లే. ఖర్చులు పెరిగాయి కాబట్టి వుద్యోగం చేయమంటారు. అంతే కానీ నాజీతం ఏమీ ఆయన తీసుకోరు. ఆయన జీతం కూడా తెచ్చి నాకే యిస్తారు." ఉక్రోషంగా చెప్తుంది అహల్య.

వసుంధర నవ్వుతుంది. "అవునమ్మా! మీ ఆయన చాలా గొప్పవారు" అనేసి అక్కడినుంచి వెళ్ళిపోతుంది. కొంచెం దూరం వెళ్ళి. . . "ఎంత గొప్పవారంటే, కనీసం డబ్బు ఖర్చుల తలనెప్పి కూడా తనమీద పెట్టుకోరు. అన్నీ నీమీదకి నెట్టేసి హాయిగా తిరుగుతూంటారు. తమరేమో యిలా ఆత్మవంచన చేసుకుంటూ ఆనందిస్తూంటారు." అని వెక్కిరిస్తుంది.

"నీకూ పెళ్ళయితే అప్పుడు తెలుస్తుందిలే." కచ్చగా చెప్తుంది అహల్య.

ఇద్దరూ నవ్వుకుంటారు.

నిజానికి అహల్యకి కూడా అపుడపుడూ అనిపిస్తూంటుంది, తన వాదనలో ఏదో లోపం వుందని. కాని అదేమిటో ఆమెకి అర్థం కాదు.

"తను లేకపోతే ఒక్క క్షణం బ్రతకలేనట్లు ప్రవర్తించే సుధీర్.., తన కౌగిలిలో స్వర్గాన్ని వెతుక్కునే సుధీర్... అతనికి తనంటే ప్రేమ లేదని ఎలా అనుకుంటుంది!

బద్ధకం వల్లో.. అశ్రద్ధ వల్లో కొన్ని పనులు చేయనంత మాత్రాన తనంటే ప్రేమే లేదని ఎందుకనుకోవాలి!

రోజంతా యివే ఆలోచనలు.

అయిదున్నర అవగానే ఆఫీసులో నుంచి బయటకి వచ్చింది అహల్య. సరిగ్గా అన్నం తినని నీరసం, కడుపులో నెప్పి... అన్నిటి వల్లా ఆమె మొహం వాడిపోయింది.

ఎలాగో బస్ ఎక్కి విండోసీట్ లో జారగిల బడింది.

ప్రక్కనే ఎవరో అమ్మాయి కూర్చుంది. చూడటానికి చాలా బీదగా వుంది. జ్వరంగా వుంది కాబోలు. ఒక దళసరి దుప్పటి ఒంటినిండా కప్పుకుంది.

బస్ కొంచెం దూరం వెళ్ళగానే ఏదో కలకలం వినిపించింది వెనకాల. ఒకతను అందరినీ తోసుకుంటూ ముందుకు వస్తున్నాడు. మాసిపోయిన లుంగీ పైకి ఎగ్గట్టి, భుజం మీద ఓ మురికి టవల్‌తో, వెలిసిపోయిన చొక్కాతో చెమటలు కక్కుతూ వస్తున్నాడు.

అహల్య ప్రక్కన కూర్చున్న అమ్మాయిని చూశాక, "అమ్మయ్య. వున్నావా!" అన్నాడు అలుపు తీర్చుకుంటూ.

ఎవరో అడిగారు "ఏమయిందయ్యా!" అని.

"అక్కడ దిగి ఏరే బస్ ఎక్కాల సామీ! నేను ఈ బస్ దిగి ఆ బస్ ఎక్కేసినా. అయిదు రూపాయలు పెట్టి టిక్కట్లు కూడా కొన్నా. ఇదేమో ఇట్టాగే కూర్చున్నాది." అతను చెప్పాడు.

అహల్య జాలిగా చూసింది... అయిదు రూపాయలు వేస్ట్ అయ్యాయంటే వాళ్ళకి ఎంత బాధగా వుంటుందో కదా అని.

"చూసుకోవద్దటమ్మా!" అన్నాడు ఎవరో పెద్దమనిషి. "అతను ఎక్కడ దిగుతున్నాడో కనిపెట్టుకోవాలి." మందలింపుగా చెప్తున్న ఆయన్ని అడ్డుకున్నాడు అతను.

"అదెక్కడ చూస్తాది సామీ జొరంతో కళ్ళు మూతలు పడిపోతా వుంటే. తప్పునాదేలే. నేనే దిగేటపుడు చూసుకోనుంటే అయిపోయేది."

అహల్య ఉలిక్కిపడింది.

ఒక మనిషి మరో మనిషిని అర్థం చేసుకోవడం అంటే ఏమిటో.. ఒక మనిషి మరో మనిషిని ప్రేమించడం అంటే ఏమిటో.. భూతద్దంలో పెట్టి చూపించినట్లుగా అనిపించింది.

"తప్పు నాదేలే!" అన్న మాటని ఎంత తేలిగ్గా.. ఎంత హాయిగా అన్నాడతను!

సుధీర్ ఎపుడయినా అంటాడా యిలా!

ఆనందాల్నీ.. సుఖాల్నీ.. ప్రశంసలనీ తప్ప.. బరువుల్నీ .. బాధ్యతలనీ.. తప్పుల్నీ తనమీదికి లాక్కుంటాడా ఎపుడయినా!

బస్ ఆగగానే ఆ అమ్మాయిని లేపాడతను. దుప్పటి సరిగా కప్పి, భుజాల చుట్టూ చేతులు వేసి జాగ్రత్తగా తీసుకువెళ్తున్నాడు.

అహల్య షాక్ తిన్నట్లూ వాళ్ళ వైపు చూస్తూండి పోయింది.

ఎక్కడో మనసు మారుమూలల్లో పుట్టిన ప్రశ్న క్షణాల్లో విశ్వమంతా క్రమ్మేసినట్లయింది.

ప్రేమంటే ఏమిటి!

ఒకళ్ళు కష్టపడుతూ.. మరొకరు సుఖపడుతూ..

ఒకరు ప్రేమని ప్రకటిస్తూ.. మరొకరు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ..

ఒకరు అర్థం చేసుకోలేకపోతూ.. యింకొకరు అడ్జస్టయిపోతూ..

అది ప్రేమవుతుందా!

పెళ్ళి లోనూ, పెళ్ళి అయ్యాకా సుధీర్ ప్రవర్తనలో.. ప్రతి ఆలోచనలో కనిపిస్తున్నది ప్రేమేనా!

అవును. అతను ప్రేమిస్తాడు.

తను ఆరోగ్యంగా వున్నంతవరకూ.. అందంగా వున్నంత వరకూ.. వుద్యోగం చేస్తూన్నంత వరకూ..

అహల్యకి ఒక్కసారిగా జాలేసింది. తన మీదే కాదు.. తనలాంటి స్త్రీలందరిమీదా... ఎందుకిలాంటి నాటకాన్ని నిజమయిన ప్రేమగా భ్రమిస్తారు ఆడవాళ్ళు! అందుకోసం తమకున్న చిన్న చిన్న కోరికల్నీ.. ఆశయాలనీ.. తమ వ్యక్తిత్వాన్నీ ఎందుకు చంపేసుకుంటారు!

ఆ అసంతృప్తులన్నీ మనసులో అగ్నిపర్వతాల్లా పెరిగిపోయి.., పేలిపోతుంటే..
ఎందుకు నిస్సహాయంగా చూస్తారు!
లేదు. ఇక మీదట తను అలా వుండదు. సుధీర్‌ని ప్రేమిస్తుంది. కానీ అతన్ని ప్రేమించడం కోసం తన కోరికల్ని చంపుకోదు.
తన యిష్టాలు తీర్చుకుంటూ.. జీవితాన్ని ఆనందిస్తూ.. ఆ ఆనందం యిచ్చే శక్తితో సహనంతో సుధీర్‌ని యింకా ఎక్కువగా ప్రేమిస్తుంది.
ఆమె పెదవులపై నవ్వు కదలాడింది.
నీళ్ళు నిండిన కళ్ళకి బిర్లామందిర్ మసకమసకగా కనపడింది.
బస్ దిగి పబ్లిక్ టెలిఫోన్ వైపు నడిచింది అహల్య. నంబర్ రింగ్ చేసి అటువైపు సుధీర్ ఫోన్ ఎత్తగానే చెప్పింది.
"ఏవండీ! నేను డ్యాన్స్ ప్రోగ్రామ్‌కి వెళ్తున్నాను. ఇంటికొచ్చేసరికి తొమ్మిదవుతుందేమో!"
సమాధానం కోసం ఎదురు చూడలేదు అహల్య. ఫోన్ పెట్టేసి వెనక్కి తిరిగింది.
ఆ తర్వాత రవీంద్రభారతి వైపు అడుగులు వేసింది.. ఉత్సాహంగా.. క్రొత్తగా జన్మ ఎత్తినంత ఆనందంగా.

*****